నేడు ఉచిత వైద్య శిబిరం

కాచిగూడ: ముత్తూట్ ఎం.జార్జ్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన గోల్నాక డివిజన్ శాస్త్రీనగర్ బస్తీలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్యాంపు నిర్వాహకులు, ప్రముఖ సామాజిక సేవకురాలు మంజుల తెలిపారు. కిడ్నీ, గుండె, లివర్, షుగర్, బీపీ తదితర వ్యాధులకు సంబంధించిన వైద్య నిపుణులు అందుబాటులో ఉంటారన్నారు. పూర్తి వివరాలకు సెల్: 9951764811లో సంప్రదించాలని సూచించారు.

నేడు ఆర్టీసీ డయల్ యువర్ డీఎం

కాచిగూడ: ఆర్టీసీ కాచిగూడ డిపో పరిధిలోని ప్రయాణికులకు మెరుగైన సేవలను అందించేందుకు వీలుగా సలహాలు, సూచనలు స్వీకరించడానికి 'డయల్ యువర్ డీఎం'కార్యక్రమాన్ని ఈ నెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2గంటల వరకు అందుబాటులో ఉంటామన్నారు. ఈ ఫోన్ నం.99592 26130లో సలహాలు, సూచనలు, ఫిర్యాదులు ఇవ్వొచ్చని తెలిపారు.

ఆర్టీసీ బర్కత్‌పుర డిపోలో..

ఆర్టీసీ బర్కత్‌పుర డిపోలో ఈనెల 30న సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు 'డయల్ యువర్ డీఎం'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఆర్. మంజుల రెడ్డి తెలిపారు. ప్రయాణీకులు తమ సమస్యలను, సూచనలు, సలహాలను ఫోన్ నం.90004 06069కు తెలియజేయాలని ఆమె కోరారు.

సీఎం సహాయనిధి మంజూరులో జాప్యం తగదు



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి: సీఎం సహాయనిధి మంజూరులో జాప్యం తగదని ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.6.36 లక్షల విలువ చేసే చెక్కులను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ పేదల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు ముఠాజైసింహ, రాకేష్‌కుమార్, శంకర్‌ముదిరాజ్, శ్రీకాంత్, సాయికృష్ణ, ముఠానరేష్, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

స్ట్రీట్ లైట్స్‌కు మరమ్మతు



మోతీమార్కెట్‌లో స్ట్రీట్‌లైట్స్‌కు మరమ్మతు చేయిస్తున్న కార్పొరేటర్

కాచిగూడ: కాచిగూడ డివిజన్‌లోని మోతీమార్కెట్, చెప్పల్‌బజార్, నింబోలిఅడ్డ తదితర ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్స్ వెలగకుండా స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ మంగళవారం జీహెచ్‌ఎంసీ స్ట్రీట్ లైట్స్ విభాగం అధికారులను పిలిపించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో స్ట్రీట్స్ లైట్స్‌కు మరమ్మతులు చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బల్వీర్, వాసు, బి.భీమ్‌రాజ్, సూరి, చందు, ఎస్.రవియాదవ్, జ్ఞాని, తదితరులు పాల్గొన్నారు.

దేవీప్రసాద్‌కు గుమ్మడి పురస్కారం



పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, వంశీ రామరాజు

చిక్కడపల్లి: కళానిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఎందరో మహానుభావులు వారి మధుర స్మృతులలో భాగంగా సంగీత విభావరి, నృత్య ప్రదర్శనలు కార్యక్రమాలను నిర్వహించారు. త్యాగరాయ గానసభలో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం సినీ దర్శకుడు దేవీప్రసాద్‌కు గుమ్మడి పురస్కారం, రాజేంద్రబాబుకు కోడి రామకృష్ణ పురస్కారం, నటి శిరీషసామవేదంకు ఉదయ్ కిరణ్ పురస్కారాన్ని ఎమ్మెల్సీ మధుసూదనాచారి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వంశీ రామరాజు, దైవజ్ఞశర్మ, మురళీధర్, శ్రీనివాస్, వీరభోగ వసంతరాయులు, సురేందర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

లష్కర్‌కు సుస్తీ..!

కాలనీలు, బస్తీల్లో విజృంభిస్తున్న విష జ్వరాలు

- పిల్లలకు న్యుమోనియా, డెంగీ, మలేరియా బారిన పెద్దలు
- ఆసుపత్రులకు క్యూ కడుతున్న రోగులు
- గాంధీకి రెఫర్ చేస్తున్న వైద్యాధికారులు
- అప్రమత్తమైన ప్రభుత్వ విభాగాలు



రోగితో మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రత్యూష



సీతాఫల్‌మండి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

సికింద్రాబాద్: వారాసీగూడకు చెందిన రోహిత్ ఇంజినీరింగ్ విద్యార్థి. వారం క్రితం తలనొప్పి, జ్వరం బారిన పడ్డాడు. సాధారణ మందులతోనే నయమవుతుందని సరిపెట్టారు. అయితే రోజురోజుకు జ్వరం తగ్గకపోగా నీరసం పెరుగుతుండడంతో ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమిస్తుందని ప్రభుత్వాసుపత్రి వైద్యులు హెచ్చరించగానే సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు టైఫాయిడ్ సోకినట్టు నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు.

◆ మెట్టుగూడ ఆలుగడ్డబావికి చెందిన రమణమ్మ 4 రోజుల క్రితం అనారోగ్యానికి గురి కాగా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు డెంగీ బారిన పడ్డారని నిర్ధారించి గాంధీ ఆసుపత్రికి తరలించారు.

◆ ఇది ఈ ఇద్దరి పరిస్థితి మాత్రమే కాదు. సికింద్రాబాద్ ప్రాంతంలోని చాలా బస్తీల్లోని పిల్లలకు అంటు వ్యాధులతో పాటు న్యుమోనియా, పెద్దలకు డెంగీ, మలేరియా జర్వాలు సోకుతున్నాయి. గడిచిన 30 రోజులుగా వైరల్ ఫీవర్లు సోకుతున్న వారి సంఖ్య పెరిగిపోతున్నదని సికింద్రాబాద్ నియోజకవర్గంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పేర్కొంటున్నారు.

ఆసుపత్రులకు బారులు..

◆ దోమల నివారణకు జీహెచ్‌ఎంసీ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజలు విష జ్వరాల బారిన పడుతుండడం గమనార్హం. నియోజకవర్గంలో 6 పీహెచ్‌సీలు, 7 బస్తీ దవాఖానాలు ఉన్నాయి. జూలై మొదటి వారం నుంచి ఆసుపత్రులకు వస్తున్న ప్రతి 10 మందిలో సాధారణ వైద్యంతో 2,3 రోజుల్లో 6 గురు కుదుట పడుతుండగా నలుగురికి విషజర్వాలు సోకుతున్నట్టు వైద్యులు నిర్ధారిస్తున్నారు. మరోవైపు పిల్లలు జ్వరాల బారిన పడుతుండడంతో పాటు న్యుమోనియాతో బాధపడుతున్నారు.

విషజ్వరం బారిన 100 మంది..

◆ అడ్డగుట్ట, చంద్రబాబునాయుడు నగర్, మెట్టుగూడ,వారాసీగూడ బస్తీల్లోని నాలా పరీవాహక ప్రాంతాల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఈ ప్రాంతాలకు చెందిన 500 మంది జ్వరాల బారిన పడినప్పటికీ ఇందులో 105మందికి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాలు సోకినట్టు వైద్యులు నిర్ధారించారు. ఇందులో 36 మంది ఆరోగ్యం కుదుట పడగా మిగతావారంతా గాంధీతో పాటు పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

ఇంటింటి సర్వేతో కట్టడి..

◆ సికింద్రాబాద్ ప్రాంతంలో విష జ్వరాల కట్టడికి వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. ఆసుపత్రికి వస్తున్న రోగుల సంఖ్య ఆధారంగా అనారోగ్యం బారిన పడుతున్న బస్తీలను గుర్తిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వైద్యారోగ్య శాఖకు చెందిన బృందాల ప్రతినిధులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఈనెల రెండో వారం నుంచి సర్వే ప్రారంభించిన వైద్యా బృందాలు ఇప్పటివరకు 1,586 మందిని పరీక్షించారు. ఇందులో 480 మంది రక్త నమునాలు సేకరించి పరీక్షల కోసం ఆసుపత్రులకు పంపించగామిగతా వారికి మందులు అందించి ఇంటికే పరిమితం కావాలని సూచిస్తున్నారు.

అధికారులు అప్రమత్తం..

◆ జ్వరాల నివారణకు వైద్యారోగ్య శాఖ అధికారులు సికింద్రాబాద్ ప్రాంతంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. అన్ని పీహెచ్‌సీలు, బస్తీ దవాఖానల్లో సిబ్బందిని, మందులను అందుబాటులో ఉంచారు. అలాగే వైద్య బృందాల ద్వారా బస్తీల్లో సర్వే నిర్వహిస్తున్నారు. సర్కిల్ పరిధిలో పారిశుద్ధ్యం పనులు వేగవంతం చేశామని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు చెప్పారు. నాలా పరీవాహక ప్రాంతాల్లో దోమలను అరికట్టేందుకు మందులు పిచికారీ చేయడంతో పాటు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మరోవైపు జలమండలి అధికారులు సైతం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసుకున్నారు. కలుషిత జలాల నివారణకు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లీకేజీలకు సంబంధించిన సమస్యలపై తక్షణమే స్పందించి సత్వర చర్యలు తీసుకుంటున్నారు.

పెండింగ్ పనులను తక్షణమే పూర్తి చేయండి



గోల్నాక అశోక్‌నగర్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

అంబర్‌పేట: నియోజకగ్గంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యం నివారించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అధికారులకు సూచించారు. చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యం చోటు చేసుకోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని అధికారులు గుర్తించాలని ఆయన తెలిపారు. గోల్నాక డివిజన్‌లో పలు ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతుండడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన మంగళవారం ఆయన ప్రాంతాల్లో పర్యటించి చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఎమ్మెల్యే పర్యటిస్తుండడంతో స్థానికులు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. వారు నిత్యం పడుతున్న ఇబ్బందులపై ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు గడుస్తున్న రోడ్ల నిర్మాణం, పైపులైన్ల నిర్మాణం పూర్తి కాకపోవడం ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో చేపట్టిన పనుల్లో ఎందుకు జాప్యం జరుగుతోందని ఆయన అధికారులను ప్రశ్నించారు. సాధ్యమైనంత త్వరగా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

డీడీలో పట్టుబడిన వారికి న్యాయస్థానం వినూత్న శిక్ష



శిక్షపడిన వారితో ప్లకార్డులను ప్రదర్శింపజేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అంబర్‌పేట: మద్యం తాగి వాహనం నడిపితే జరిగే నష్టంపై డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులు అవగాహన కల్పించారు. న్యాయస్థానం వేసిన శిక్షను పాటిస్తూ చౌరస్తాల్లో మద్యం తాగి వాహన నడుపరాదంటూ ప్లకార్డులు ప్రదర్శించి వాహనదారులకు అవగాహన కలిగేలా వ్యవహరించారు. కాచిగూడ ట్రాఫిక్ చేపట్టిన డ్రంకన్ డ్రైవ్ పట్టుబడిన వారికి నాంపల్లి 8వ ఎంఎం జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జరిమానాతో పాటు అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని శిక్ష విధించింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు న్యాయస్థానం ఆదేశాల మేరకు శిక్ష అమలు చేశారు. పోలీసుస్టేషన్ పరిధిలో తిలక్‌నగర్, ఛే-నంబరు చౌరస్తాల్లో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఐదు మందితో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇతర వాహనదారులు గమనిస్తూ రాకపోకలు సాగించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు జ్ఞానేశ్వర్, దుర్గాప్రసాద్, ఏఎస్సై అనిల్‌కుమార్, ఇతర సిబ్బంది ఉన్నారు.

గూడ్స్ రైలు ఢీకొని యువకుడు మృతి

కాచిగూడ: గూడ్స్ రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... మహబూబ్‌నగర్‌కు చెందిన కుమ్మరి ప్రవీణ్ కుమార్ (23) గ్రూప్స్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నాడు. మహబూబ్‌నగర్ వెళ్లడానికి మంగళవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైలు టికెట్ తీసుకొని స్టేషన్ లోని రెండవ ప్లాట్ ఫారంకు వెళ్లాడు. ప్లాట్ ఫారం అంచున నిలబడి ఉన్న ప్రవీణ్ కుమార్‌ను గూడ్స్ రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలతో అక్కడిక్కడే అతను మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యకు ఉన్న విలువ మరే రంగంలో లేదు



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఆర్‌ఎస్‌ఎస్ నేత సురేష్ మంజునాథ్, రవికుమార్

కాచిగూడ: చదువు స్థిరాస్తిలాంటిదని, విద్యకు ఉన్న విలువ మరే రంగంలోనూ లేదని ఆర్‌ఎస్‌ఎస్ సెంట్రల్ జిల్లా పర్యావరణ ప్రముఖ్ సురేష్ మంజునాథ్ అన్నారు. కాచిగూడ భావసార్ భవన్‌లో విశ్వహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ సభ్యులు, విశ్వహిందూ పరిషత్ ధర్మప్రసార సంపర్క్ ప్రముఖ్ రాపర్తి రవికుమార్, మరికంటిపోత రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ నేతలు రామన్నగారి పోచాలు ప్రసాద్, అయిల అశోక్, వెంకటరెడ్డి, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించాలని తెలంగాణ స్టూడెంట్ పరిషత్ (టీఎస్‌పీ) నాయకులు డిమాండ్ చేశారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి చేతిలో కీలక శాఖలు విద్య, హోం శాఖలు ఉన్నాయని దీంతో సరైన న్యాయం చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న రూ.8300 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్, మెస్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని కోరారు.

అంతర్జాతీయ మిత్రుల దినోత్సవం



విద్యార్థులతో స్వరూపరాణి, జ్యోతి

చిక్కడపల్లి: స్నేహం బంధాలకు ఉపయోగపడుతుందని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నవభారత్ అధ్యక్షురాలు స్వరూపరాణి పేర్కొన్నారు. అంతర్జాతీయ మిత్రుల దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ నవభారత్, వనితా భారతి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్‌లోని గీతాంజలి పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అబాకస్ వేదిక్ మ్యాథ్స్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వనిత భారత్ అధ్యక్షురాలు కృష్ణవేణి, పాఠశాల ప్రిన్సిపల్ శాంత, జ్యోతి, మోహనకృష్ణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన



ఎంటమాలజీ సిబ్బందిని అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్

అంబర్‌పేట: దోమల నివారణపై విద్యార్థులు అవగాహన పెంచుకుని ఇతరులకు చైతన్య పర్చాల్సిన అవసరం ఉందని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్‌లోని వాంబేకాలనీలోని ప్రభుత్వ ఎంటమాలజీ విభాగం అధికారులతో కలిసి పాఠశాలలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల నివారణతో సిజనల్ వ్యాధులతో పాటు ఇతర వ్యాధులను దరిచేరకుండా చూడవచ్చన్నారు. దోమల నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగం అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాక్స్‌నాలా పైకప్పు నిర్మాణానికి సన్నాహాలు



బ్రహ్మకుమారీస్ ఎదురుగా నాలా పైకప్పును పరిశీలిస్తున్న కార్పొరేటర్ అమృత, డీఈ ప్రవీణ్

నల్లకుంట: నల్లకుంట తిలక్‌నగర్ చౌరస్తా సమీపంలోని బ్రహ్మకుమారీస్ కార్యాలయం ఎదురుగా బాక్స్ నాలా పై పూర్తిస్థాయిలో శ్లాబ్ నిర్మాణం చేపట్టకుండా సిమెంట్ బిల్లలు ఏర్పాటు చేశారు. దీంతో బ్రహ్మకుమారీస్ కేంద్రానికి ధ్యానం కోసం వచ్చే వృద్ధులు, మహిళలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను కార్పొరేటర్ అమృత, జీహెచ్‌ఎంసీ డీఈ దృష్టికి తీసుకు వెళ్లారు. అందుకు స్పందించిన ఆమె మంగళవారం జీహెచ్‌ఎంసీ డీఈ ప్రవీణ్‌తో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. బాక్స్ నాలాపై ఏర్పాటు చేసిన బిల్లల మధ్యలో అక్కడక్కడ గ్యాప్ ఉండడాన్ని గమించారు. బ్రాహ్మకుమారీ కేంద్రం ఎదుట సుమారు ఐదారు మీటర్ల పొడవున శ్లాబ్ నిర్మాణం చేయాలని డీఈని కోరారు. అందుకు డీఈ అంగీకరించారు. కాగా శివం ఆలయం వద్ద నుంచి చేనంబర్ వరకు స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎస్‌ఎన్‌డీపీ) ద్వారా సుమారు రూ 5 కోట్లకు పైగా నిధులతో త్వరలోనే బాక్స్ నాలా నిర్మాణ పనులు చేపడతారని సమాచారం. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ వృద్వి, వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నల్లకుంట సీఐ జగదీశ్వర్ రావు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం నిధుల వినియోగంపై సమీక్ష



సమావేశంలో చర్చిస్తున్న కార్పొరేటర్ అమృత, ఎస్‌పీహెచ్‌ఓ డా. సాయిబాబా

నల్లకుంట: అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లోని బస్తీ దవాఖానాలు, యూపీహెచ్‌సీలకు నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ద్వారా మంజూరైన నిధులపై మంగళవారం కోఠిలోని యూపీహెచ్‌సీలో పట్టణ ఆరోగ్య మిషన్ సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత, యూపీహెచ్‌సీ కోటి క్లస్టర్ సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్(ఎస్‌పీహెచ్‌ఓ) డాక్టర్ సాయిబాబా, రత్నానగర్ బస్తీ దవాఖానా వైద్యాధికారి కీర్తన్, లెప్రసీ పారామెడికల్ అధికారి కె. శ్రీనివాస్‌రెడ్డి, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మనోజ్‌రెడ్డి, సుల్తాన్‌బజార్ పీహెచ్‌సీ పీహెచ్‌ఎన్ ఎ.భాగ్యలక్ష్మి, జీహెచ్‌ఎంసీ హెల్త్ అసిస్టెంట్ ధర్మారెడ్డి తదితరులు టీబీ శిబిరాల ఏర్పాటు, ఎన్‌హెచ్‌ఎం ద్వారా మంజూరైన నిధులను ఏ పనుల కోసం వినియోగించాలి అనే దానిపై చర్చించారు.

అన్ని రంగాల్లో రాణించేలా విద్యార్థులను తీర్చిదిద్దాలి

భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ జాయింట్ సెక్రటరీ జాన్ సామ్యూల్



ప్రగతి విద్యానికేతన్‌లో ఏర్పాటు చేసిన స్కౌట్స్ విద్యార్థుల బృందంతో సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

అంబర్‌పేట: విద్యార్థులు భవిష్యత్‌లో అన్ని రంగాల్లో రాణించేలా పాఠశాల స్థాయిలోనే తీర్చిదిద్దాల్సిన అవసరముందని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జాన్ సామ్యూల్ తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అంబర్‌పేటలోని ప్రగతి విద్యానికేతన్ పాఠశాలలో స్కౌట్స్ బృందాన్ని ఎంపిక చేసి వారికి బాధ్యతలకు సంబంధించిన బ్యాడ్జీలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సామ్యూల్ మాట్లాడుతూ... పాఠశాల స్థాయిలో విద్యార్థులకు న్యాయకత్వ లక్షణాలతో పాటు సేవాభావం, శారీక ధృడత్వం, సామాజిక బాధ్యత వంటి అంశాలను అలవర్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహపడతాయని అన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల స్కౌట్స్ బృందాలను ఏర్పాటు చేసి సమాజానికి మంచి పౌరులను అందించాలని ఆయన కోరారు. ప్రస్తుతం పాఠశాల స్థాయిలో విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటుపడి భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఆసక్తి ఉన్న రంగాలపై దృష్టి మరల్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులుఉ మోహన్‌రావు, లక్ష్మణ్, రవికిరణ్‌చారి, అమర్‌జ్యోతి, పాఠశాల చైర్మన్, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్, ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు సవిత, భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మున్నూరుకాపులకు ప్రాధాన్యం ఇవ్వండి

మున్నూరుకాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు డా.కొండా దేవయ్య పటేల్



కాచిగూడ: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరుకాపులకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలని తెలంగాణ మున్నూరుకాపు సంఘం పటేల్స్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ ప్రధాన రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీల్లో అత్యధిక జనాభా కల్గి రాజకీయంగా ఆయా పార్టీల్లో వేల సంఖ్యలో మున్నూరుకాపు నేతలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో మున్నూరుకాపులను గెలిపించుకునే బాధ్యత సంఘం తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు మున్నూరుకాపులు అందిస్తున్న సేవలను గుర్తించి ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలని కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలవడగానే ఆయా పార్టీల అధినేతలను కలిసి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేయనున్న మున్నూరుకాపు అభ్యర్థుల వివరాలతో కూడిన జాబితాను అందించనున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉత్సాహంగా ఉన్న మున్నూరుకాపు నేతలు తమ పేర్లను సంఘ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఒక లక్ష మందితో సంఘం సభ్యత్వాన్ని సేకరించడమే లక్ష్యంగా పటేల్స్ సంఘం కృషి చేస్తుందని తెలిపారు. సభ్యత్వ సేకరణలో సంఘ సభ్యులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

నాగదేవత ఆలయాలకు పోటెత్తిన భక్తులు – ప్రత్యేక పూజలు చేసిన ప్రజాప్రతినిధులు

చిక్కడపల్లి వివేక్‌నగర్ పీపుల్స్ పార్క్ నాగదేవత రేణుకాఎల్లమ్మ ఆలయం, ఆంజనేయస్వామి, ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి సందర్భంగా నాగదేవత పుట్టల్లో మహిళభక్తులు మంగళవారం పాలుపోసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ, నేతలు ముచ్చుకుర్తి ప్రభాకర్ పద్మలు, శంకర్‌ముదిరాజ్, ముదిగొండ మురళి, ఈవోలు దేవనాథం, పి.లక్ష్మారెడ్డి, వంశీ, రాజేశం, ఆలయ పూజారి గుండ శ్రీనివాస్, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – చిక్కడపల్లి







వివేక్‌నగర్ పీపుల్స్ పార్కులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీఆర్ఎస్ నేతలు